# విద్యాసంస్థల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్!

- 25లోపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- సీఎం, సీఎస్సార్ నిధులతో కొత్త భవనాల నిర్మాణం



**సంగారెడ్డి, ఏప్రిల్ 10 (జనం పవర్):** సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, హాస్టళ్ల అభివృద్ధి కోసం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టాలని జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల అధికారులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్ఓ పాండు సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కొనసాగింపుగా ఈ చర్చ జరిగింది. విద్యార్థుల సంఖ్య భవిష్యత్తులో పెరుగుతుందనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు తరగతి గదులు, సొంత భవనాలు, హాస్టల్ వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వారు వివరించారు. ముఖ్యంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో టాయిలెట్లు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. తారా డిగ్రీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కళాశాల, బాయ్స్ హైస్కూల్ వంటి సంస్థల్లో అదనపు గదులు, హాస్టల్ వసతుల అవసరాలపై సమగ్రంగా చర్చించారు.

### నిధుల సమీకరణపై ప్లాన్

ప్రతి విద్యాసంస్థకు అవసరమైన నిధుల అంచనాలు సిద్ధం చేసి ఈ నెల 25లోపు విడివిడిగా ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపాదనలు అందిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులతో పాటు సీఎస్సార్ నిధులను వినియోగించి భవనాల నిర్మాణం పూర్తి చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. సీఎస్సార్ నిధుల కోసం అరబిందో, ఎంఎస్ఎన్, యూబీ వంటి పరిశ్రమల ప్రతినిధులతో జగ్గారెడ్డి ఫోన్ ద్వారా మాట్లాడగా వారు సానుకూలంగా స్పందించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ప్రధాన లక్ష్యమని, నిధుల విషయంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 25న మరోసారి సమావేశమై ప్రతిపాదనలపై సమీక్షించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని జగ్గారెడ్డి, నిర్మల తెలిపారు.

# జన్నారం ఎస్ఐగా ఉదయ్ కిరణ్ బాధ్యతలు

**వివాదాస్పద ఎస్ఐ సస్పెన్షన్ తర్వాత నియామకం**

**శాంతిభద్రతలపై దృష్టి సారించాలని ప్రజల ఆకాంక్ష**

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జన్నారం పోలీస్ స్టేషన్ కొత్త స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా సబ్ ఇన్‌స్పెక్టర్ జి. ఉదయ్ కిరణ్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ గొల్లపల్లి అనూషపై వచ్చిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో ఈ మార్పు చోటుచేసుకుంది. జన్నారం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన గొల్లపల్లి అనూషపై విచారణలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి తప్పుడు సాక్ష్యాలను సృష్టించడం, విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడడం వంటి ఆరోపణలతో ఆమెను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఆమెను తక్షణమే విధులకు దూరంగా ఉంచుతూ వీఆర్ కు బదిలీ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రామగుండం కేంద్రంలో ఉన్న జి. ఉదయ్ కిరణ్‌ను జన్నారం ఎస్హెచ్ఓగా పంపిస్తూ జోన్-1 కాళేశ్వరం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అంకితభావం కలిగిన అధికారిగా గుర్తింపు ఉన్న ఆయన రాకతో శాంతిభద్రతలు గాడిలో పడతాయని, బాధితులకు న్యాయం జరుగుతుందని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు.



# ఎంపీఓలకు వెహికల్ అలవెన్స్ ఇవ్వాలి

**కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన పంచాయతీ అధికారులు**

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (జనం పవర్):** మంచిర్యాల జిల్లాలో తెలంగాణ రాష్ట్ర మండల పంచాయతీ అధికారుల సంఘం ఆదేశాల మేరకు మండల పంచాయతీ అధికారులు కలెక్టర్ ను కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న మండల పంచాయతీ అధికారులకు వెహికల్ అలవెన్స్ కొరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రతిపాదనలు పంపమని తెలిపింది. ఈ నేపథ్యంలో మంచిర్యాల మండల పంచాయతీ అధికారులు కలెక్టర్ ను కలిసి నెలకు 34 వేల రూపాయల వెహికల్ అలవెన్స్ ఇప్పించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మండల పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు శ్రీపతి బాపూరావు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి అజ్మత్ అలీ, అసోసియేట్ ప్రెసిడెంట్ జీ అనిల్, శ్రీనివాస్, ప్రసాద్, సతీష్ రెడ్డి, ఉమర్ షరీఫ్, వెంకటేష్, మహేష్, రమ్యశ్రీ తదితరులు కలెక్టర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# ఎస్టీపీపీలో విద్యుత్ తనిఖీ అధికారి పర్యటన

- 800 మెగావాట్ల ప్లాంట్ పనుల పరిశీలన
- అధికారి రాజుకు ఘన సన్మానం



**జైపూర్, ఏప్రిల్ 10 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని (ఎస్టీపీపీ) తెలంగాణ ప్రభుత్వ ఉప విద్యుత్ తనిఖీ అధికారి ఏ. రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ సిహెచ్. చిరంజీవి ఆయనకు పూల మొక్కను బహుకరించి స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించడంలో భాగంగా ఈ పర్యటన జరిగింది. అనంతరం 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మాణ పనులలో భాగంగా చేపట్టిన ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన పనులను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. ప్లాంట్‌కు మొదటిసారిగా వచ్చిన ఏ. రాజును ఎస్టీపీపీ అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. స్థానిక మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిశితంగా గమనించడం ఈ క్షేత్ర పర్యటన ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో జీఎం ఎం. నరసింహారావు, జీఎం ఎం. మదన్ మోహన్, డీజీఎం పర్సనల్ డి. కిరణ్ బాబు, ఎస్ఈ ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చలో గాంధీ భవన్.. ముందస్తు అరెస్టులు!



**కోకోపేట భూమిని ముదిరాజ్ జాతికి అంకితం చేయాలని డిమాండ్**

**మందమర్రిలో ముదిరాజ్ మహాసభ నాయకుల అరెస్ట్**

**వేల్పుల నగేష్ జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

చలో గాంధీ భవన్ ముట్టడికి తరలి వెళ్లకుండా మందమర్రి పట్టణానికి చెందిన పలువురు తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ముదిరాజ్ ల సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులతో బెదిరింపులకు పాల్పడటం సరైనది కాదని ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు. కోకో పేటలో గల భూమిపై ఉన్న ట్రస్ట్ ను రద్దు చేసి దానిని ముదిరాజ్ జాతికి అంకితం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. మత్స్యశాఖ నిధుల దుర్వినియోగం పై సమగ్ర విచారణ నిర్వహించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముదిరాజ్ ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో సంఘం పెద్దలు నెల్లి రాజలింగు, కట్ల శ్రీనివాస్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గరిగే సుమన్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

# బియ్యం సంచిలో బంగారం

**20 తులాల నగలను పట్టించిన పోలీసులు**

**సీఐ బృందానికి బాధితుడి కృతజ్ఞతలు**



**సంగారెడ్డి, ఏప్రిల్ 10 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలో జరిగిన ఒక ఆసక్తికర ఘటనలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పోయిన బంగారాన్ని రెండు రోజుల్లోనే తిరిగి బాధితులకు అందజేశారు. సంగారెడ్డికి చెందిన మల్లయ్య తన కుటుంబంతో తిరుపతి యాత్రకు వెళ్లే ముందు ఇంట్లో ఉన్న సుమారు 20 తులాల బంగారాన్ని భద్రంగా ఉంచాలనే ఉద్దేశంతో బియ్యం సంచిలో దాచిపెట్టాడు. అయితే ఈ విషయం తెలియని అతని భార్య, ఇంటికి వచ్చిన బియ్యం కొనుగోలు దారులకు అదే సంచిని అమ్మడం జరిగింది. తిరుపతి నుంచి తిరిగి వచ్చిన తర్వాత బంగారం కనిపించకపోవడంతో మల్లయ్య షాక్‌కు గురయ్యాడు. వెంటనే సంగారెడ్డి జిల్లా బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### సీసీటీవీతో గుట్టు రట్టు

కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల సీ,సీ,టీ,వీ ఫుటేజీని పరిశీలించి, బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తిని గుర్తించారు. అతడు పిట్లం ప్రాంతంలోని ఓ రైస్ మిల్ యజమానికి బియ్యాన్ని విక్రయించినట్లు గుర్తించి, యజమానిని సంప్రదించి విచారణ చేపట్టారు. దీంతో బంగారం సంచిలోనే ఉన్నట్లు బయటపడింది. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని పోగొట్టుకున్న బంగారాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్య, తన పోయిన బంగారాన్ని తిరిగి అందించిన స్థానిక సీ,ఐ, ఎస్,ఐలను శాలువాలతో సన్మానించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. పోలీసులు చూపిన చాకచక్యం, వేగవంతమైన స్పందనపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# 19న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

**ఆరో తరగతికి ఉదయం, మిగిలిన తరగతులకు మధ్యాహ్నం పరీక్ష**

**వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచన**



**బెజ్జంకి, ఏప్రిల్ 10 (జనం పవర్):** తెలంగాణ మోడల్ స్కూల్ లో ప్రవేశాల కొరకు ఈ నెల 19న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి షెడ్యూల్ ఖరారైనట్లు వెల్లడించారు. ఆరో తరగతి చదివేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కొరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్ సైట్ లో తమ హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. పొబ్లిక్ పాలసీ, విద్యారంగ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

# ప్రకృతి సాగుతోనే మేలు..

**జన్నారంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ సదస్సు**

**రసాయన ఎరువులు తగ్గించి లాభాలు పొందాలని సూచన**



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు జన్నారం మండలం పోనకల్ రైతు వేదికలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద చింతలపల్లి, లింగయ్య పల్లి, ధర్మారం గ్రామాల నుండి ఎంపికైన 125 మంది రైతులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ సాగు పద్ధతులపై రైతులకు పలు సూచనలు చేశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సహజ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల పెట్టుబడి తగ్గి లాభాలు పెరుగుతాయని తెలిపారు. భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులు, జీవామృతం, గోమూత్రం, వర్మీ కంపోస్ట్ వంటివి వినియోగించాలని సూచించారు. ప్రకృతి సాగు వల్ల నేల సారవంతం కావడమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణ, మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, ఏఈఓలు త్రిసంధ్య, దివ్య, లవన్ పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్ మహేందర్, కృషి సఖీలు రజిత, అంజలి సహా అధిక సంఖ్యలో రైతులు ఈ అవగాహన సదస్సుకు హాజరయ్యారు.



జనం పవర్
JANAM POWER

శనివారం
11 ఏప్రిల్ 2026

# కోహెడలో 'సురక్షనేత్ర'

**సీసీటీవీల ఏర్పాటుకు విరాళాల వెల్లువ**

**ప్రతి గ్రామంలో కనీసం 10 కెమెరాలు ఉండాలి: ఏసీపీ సదానందం**

**పోలీసుల పిలుపుతో రూ. 2.10 లక్షల విరాళం అందజేసిన వివిధ సంఘాలు**



**కోహెడ, ఏప్రిల్ 10 (జనం పవర్):** కోహెడ ఎస్ఐ పి.అభిలాష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో 'సురక్షనేత్ర, ఉద్యోగమిత్ర, మన ఊరు-మన పోలీస్' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పాల్గొన్నారు. మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ కోహెడ మండలం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 'మన గ్రామం-మన ఆస్తి' అనే విధంగా ఆలోచించి, గ్రామానికి ప్రథమ పౌరులైన ప్రజాప్రతినిధులు అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల్లో దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీటీవీలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 10 కెమెరాలు, మేజర్ పంచాయతీల్లో 30 కెమెరాలు ఏర్పాటు చేసేలా గ్రామ పెద్దలు, వివిధ సంఘాల నాయకులు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### ఉద్యోగమిత్రతో అవగాహన

ఉద్యోగమిత్రలో భాగంగా ఇప్పటికే 200 దరఖాస్తులు నమోదయ్యాయని ఏసీపీ తెలిపారు. చదువుకున్న నిరుద్యోగ యువత పెడదోవ పట్టకుండా సర్పంచులు వారికి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఎస్ఐ అభిలాష్ కోహెడ గ్రామంలో సీసీటీవీల ఏర్పాటుకు సహకరించాలని కోరగా.. వివిధ సంఘాలు తక్షణమే స్పందించాయి. వర్తక వాణిజ్య సంఘం 50 వేలు, మెడికల్ అండ్ డాక్టర్స్ యూనియన్ 60 వేలు, ఫెర్టిలైజర్స్ యూనియన్ 50 వేలు, ట్రాక్టర్, హార్వెస్టర్, జేసీబీ యూనియన్ సభ్యులు 50 వేల రూపాయల విరాళాన్ని అధికారుల సమక్షంలో అందజేశారు.

# కళాకారులకు మంత్రి పొన్నం అభినందనలు

**జాతీయ నాటిక పోటీల్లో కరీంనగర్ బృందం ప్రతిభ**

**ఉత్తమ నటిగా అవార్డు పొందిన ఇందిరకు ప్రశంసలు**



**కరీంనగర్, ఏప్రిల్ 10 (జనం పవర్):** ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వారు నిర్వహించిన నాటికల పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని 'కనువిప్పు' నాటిక ప్రదర్శించిన కరీంనగర్ జిల్లా కళాకారులను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా తృతీయ బహుమతి సాధించిన ఇందిరను, నాటిక రచించి దర్శకత్వం వహించిన ఆగస్టిన్ ను ఆయన అభినందించారు. నాటికలో నటించిన రేష్మ, వసంత, రుక్సానా, స్వాతి, రఫీలకు అభినందనలు తెలిపారు. మున్ముందు మరింతగా రాణించి కరీంనగర్ జిల్లా పేరు ప్రఖ్యాతులు నిలబెట్టాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# రైతు సంఘం రాష్ట్ర మహాసభల కరపత్రం విడుదల

**ఈ నెల 23 నుంచి భద్రాద్రి కొత్తగూడెంలో మూడవ మహాసభలు**



**దండేపల్లి, ఏప్రిల్ 10 (జనం పవర్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కొండగుర్ల లింగన్న పిలుపునిచ్చారు. దండేపల్లి మండల రైతు సంఘం కమిటీ సమావేశం తాళ్లపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న ఈ సభలకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం, బోనస్, రైతు భరోసా వంటి అంశాలతో పాటు రైతు బీమా, బ్యాంకు రుణాల సమస్యలపై రైతు సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని లింగన్న పేర్కొన్నారు. భవిష్యత్తులో కార్మిక, కర్షక పోరాటాలకు ఈ మహాసభలు దిశానిర్దేశం చేస్తాయన్నారు. ప్రముఖులు, మేధావులు, రైతు శ్రేయోభిలాషులు ఈ సభలకు మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మొడతే వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎర్రోజుల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు బొమ్మిడి రాజన్న పాల్గొన్నారు. మండల కమిటీ సభ్యులు బండారి సురేష్, మద్దికుంట లక్ష్మణ్, ముడిత మహేందర్ ఈ కరపత్రం విడుదల కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# వెంకట్రావుపేట చెరువును చిత్తడి నేలగా గుర్తించాలి

- వలస పక్షుల ఆవాస ప్రాంతంపై కలెక్టర్ సమీక్ష
- అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం



**వేల్పుల నగేష్-జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని చెరువును చిత్తడి నేలగా ప్రకటించేందుకు రాష్ట్రస్థాయి సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, అదనపు కలెక్టర్ పీ. చంద్రయ్యతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

### పక్షులకు సురక్షిత నిలయం

వెంకట్రావుపేట చెరువు 132 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, ఇది ప్రపంచ ప్రసిద్ధి పొందిన వలస పక్షుల ఆవాసమని కలెక్టర్ పేర్కొన్నారు. వలస పక్షులతో పాటు స్థానిక పక్షులకు సురక్షిత ఆవాసం కల్పించేందుకు ఈ చెరువును చిత్తడి నేలగా ప్రకటించడానికి గ్రామస్తులతో పాటు రెవెన్యూ, మత్స్య, నీటిపారుదల, పర్యాటక శాఖల అధికారులకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన వివరించారు.

### కేంద్ర నిధులతో అభివృద్ధి

దీనిని చిత్తడి నేలగా గుర్తిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయని, తద్వారా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రస్థాయి సమావేశానికి ముందే పూర్తి స్థాయి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'పోషణ పక్వాడ'తో ఆరోగ్యకర భవిష్యత్తు

**గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన**

**అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం**



**దండేపల్లి, ఏప్రిల్ 10 (జనం పవర్):** దండేపల్లి మండలంలోని కన్నెపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 8వ పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం, పెరుగుదలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ జె. వెంకటలక్ష్మి మాట్లాడుతూ శిశువు జీవితంలోని తొలి ఆది సంవత్సరాలలో మెదడు వికాసాన్ని ప్రోత్సహించడం చాలా ముఖ్యమని చెప్పారు. గర్భిణీలు, బాలింతలకు శిశు పోషణపై అవగాహన కల్పించారు. స్థానికంగా దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పళ్ల ప్రాముఖ్యత గురించి వివరించారు. అమ్మమ్మలు, నానమ్మల ద్వారా పిల్లలకు కథలు చెప్పించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఇందులో కన్నెపల్లి సర్పంచ్ చుంచు నగేష్, ఉప సర్పంచ్ ముత్తు శంకరయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వీరితో పాటు ఏఎన్ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు స్వరూప, సంధ్య, ఆయా, ఆశా కార్యకర్తలు, గ్రామంలోని బాలింతలు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.









# సిద్దిపేటలో 'అంబేద్కర్' క్రికెట్ పోరు!

- క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన పూజల హరికృష్ణ
- అంబేద్కర్ ఆశయాల సాధనకే ఈ క్రీడలు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మినీ స్టేడియంలో ఈ మ్యాచ్‌లు మొదలయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ బొమ్మల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ (పూజల గోపికృష్ణ) ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీలు ఆడి గెలవాలని ఆయన సూచించారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచనలు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మార్గదర్శకత్వంలో ఈ వేడుకను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పయ్యావుల ఎల్లం యాదవ్, బొమ్మల యాదగిరి, ఖలీముద్దీన్, సాంబమూర్తి పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, రాజిరెడ్డి, రాజ బహుదూర్ రెడ్డి, బొమ్మల విజయ్, సందీప్, భార్గవ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడంతో పాటు అంబేద్కర్ ఆశయాలను విస్తృతంగా ప్రచారం చేయడం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

